క్లుప్తంగా

30న మండల సమావేశం

కోడూరు: కోడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీఓ పాండురంగారావు శనివారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

మూడు వేల మందికి అన్నసమారాధన

కోడూరు: లింగారెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్న ఆంజనేయస్వామి వారి దేవాలయం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తమలపాకు, సింధూర అర్చనను భక్తిశ్రద్ధలతో జరిపారు. ప్రత్యేకంగా తయారు చేయించిన వెండి కిరీటం, ఇత్తడి మకరతోరణాన్ని అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. నక్కవానిదారి, మందపాకల, లింగారెడ్డిపాలెం, కోడూరు గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విజయోత్సవ ర్యాలీ

పెడన: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆదివారం సాయంత్రం భారీ ర్యాలీ ఏర్పాటు చేసిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. పెడన నియోజకవర్గంలోని గూడూరు మండలం తరకటూరు నుంచి వయా గూడూరు, కప్పలదొడ్డి గ్రామాల మీదుగా పెడనలోని మంత్రి కార్యాలయానికి ర్యాలీ చేరుకుంటుంది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా ప్రారంభమయ్యే ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మంత్రి కార్యాలయం పేర్కొంది.

వేసవి శిబిరాల్లో చిన్నారుల ఆట పాటలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం చిన్నారులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పలు పాటలకు నృత్యాలు చేసిన చిన్నారులు కోలాటం, లూడో, వైకుంఠపాళి తదితర ఆటలను ఆడారు. తొలుత సరస్వతీదేవికి ప్రార్థన చేశారు. అనంతరం కథలు, పుస్తకాలు చదివారు. భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. రిటైర్డ్ ఎంఈఓ కె. రాజేంద్రప్రసాద్ లెక్కల్లోని షార్ట్ కట్‌లను నేర్పారు. వ్యాయామం, యోగా చేయించారు. ఉపాధ్యాయిని వై. జయలక్ష్మీ క్రాఫ్ట్ వస్తువులను చేసే విధానం నేర్పించారు. ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనం, మురళీ కోలాటం, చెస్, క్యారమ్స్ ఆటలు ఆడించారు. కార్యక్రమాలను ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

నజరానాకు సన్మానం



చల్లపల్లి: చల్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ సీనియర్ నాయకురాలు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ పాలక మండలి సభ్యురాలు షేక్ దిల్‌షాద్ నజరానా శనివారం ఉర్దూ అకాడమీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అయూబ్ హుస్సేన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఏపీ ఉర్దూ అకాడమీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శిని కలిసిన సందర్భంగా ఆయన దిల్‌షాద్ నజరానాను ఘనంగా సత్కరించారు. పాలక మండలి ద్వారా ఉర్దూ అకాడమీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హుస్సేన్ కోరారు.

జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం



మంగళాపురం(చల్లపల్లి): ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి వేసేందుకు జల్‌జీవన్ మిషన్ నిధులు మంజూరు చేస్తోందని మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు అన్నారు. శనివారం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మంజూరైన రూ.40 లక్షల 50 వేలతో పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టారు. గ్రామంలో 423 ఇళ్లకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ ఏఈఈ భోగాది జగత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మబంధువులు.. వలంటీర్లు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే సింహాద్రి, ఎంపీపీ రాఘవరాణి, కడవకొల్లు తదితరులు

నాగాయలంక: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచిన వలంటీర్లు ప్రతి ఇంటికి సొంత బిడ్డలుగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మబంధువులుగా నిలుస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక కె.పాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన వలంటీర్ల సేవా పురస్కారాల సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎదురుమొండి సచివాలయం పరిధిలోని వలంటీర్లు కోలా రవీంద్రబాబు, కైతేపల్లి రాజు సేవా వజ్ర పురస్కారం అందుకోగా, ఆరేవరపు నాంచారయ్య (ఎదురుమొండి), నాయుడు లంకేశ్వరుడు (ఏటిమొగ), వల్లభనేని రామయ్య (గుల్లలమోద), చెన్ను శిరీష (మర్రిపాలెం), నాయుడు రాణి (సంగమేశ్వరం) సేవారత్న పురస్కారాలను, అన్ని సచివాలయాల పరిధిలోని 278 మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేసి సన్మానించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు పారిపోతున్నారని ఎల్లో మీడియా తప్పుడు రాతలతో దిగజారి చంద్రబాబుకు ఊడిగం చేయడం ఎంత దుర్మార్గమో విద్యావంతులు ఆలోచించాలని అన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంకా ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులు, జన్మభూమికి కీర్తి ప్రతిష్టలు తెచ్చి ఇలాంటి మరెన్నో సేవా పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఉప సభాపతి బుద్ధప్రసాద్ తప్పుడు ప్రచారం, కపట ఆరోపణలతో ప్రజల సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారని విమర్శించారు. సీఎం భాషపై వ్యాఖ్యానాలు చేస్తున్న బుద్ధప్రసాద్ ముందు టీడీపీ భవిష్యత్ నేతగా ఊహించుకుంటున్న నారా లోకేష్‌కు భాష నేర్పాలని ఎద్దేవా చేశారు. వెలుగు ఏపీఎం కడవకొల్లు ఏసుదాసు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ భోగాది రాఘవరాణి, డీఎంసీఎస్ డైరెక్టర్ రేమాల సుబ్బారావు(బెనర్జీ), దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, నియోజకవర్గం సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం బసవయ్య, మండల కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావు, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, తహసీల్దార్ జె.విమలకుమారి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో వలంటీర్లకు సత్కారం

రామచంద్రపురంలో..

రామచంద్రపురం(అవనిగడ్డ): మండల పరిధిలోని రామచంద్రపురంలో వలంటీర్లకు సేవా పురస్కారాలను శనివారం అందజేశారు.

మోదుమూడి, రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని వలంటీర్లలో చందు శ్రీజ్యోతికి సేవారత్న, 26 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు తమ బిడ్డల సేవల కంటే బాగున్నాయని వృద్ధులు చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం, రామకోటిపురం సర్పంచ్‌లు వాకా రమేష్, లక్ష్మీతిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, కార్యదర్శులు బడే శేషగిరిరావు, రమాకుమారి, ఆది అశోక్, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

డీపీఓ నాగేశ్వర నాయక్



గుండుపాలెంలో రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ నాగేశ్వర నాయక్

కోనేరుసెంటర్: సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ అన్నారు. బందరు మండలం బొర్రపోతుపాలెం, గుండుపాలెం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. బొర్రపోతుపాలెంలో అర్జీదారునితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయాల్సి ఉందని అర్జీదారు చెప్పగా విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గుండుపాలెం గ్రామంలో రోడ్డు ఆక్రమణకు గురైందని ఓ గ్రామస్తుడు ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. రోడ్లు భవనాల శాఖాధికారులతో మాట్లాడి రోడ్డుకు మార్జిన్ వేయాలని ఆర్అండ్‌బీ ఏఈని ఆదేశించారు. ఎవరైతే ఆక్రమణకు పాల్పడి ఉంటారో వారికి వెంటనే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, రాధాకృష్ణన్, పంచాయతీ, ఆర్ అండ్ బీ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో రైతుల వివరాలు పక్కాగా సేకరించాలి

బందరు ఆర్డీఓ కిషోర్

గూడూరు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వేలో క్షేత్రస్థాయిలో రైతుల వివరాలు పక్కాగా సేకరించాలని బందరు ఆర్డీఓ ఐ. కిషోర్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. రెండో విడత భూ సర్వేలో భాగంగా గూడూరు మండలం రామన్నపేట గ్రామంలో ఆర్డీఓ శనివారం పర్యటించి మాట్లాడారు. గ్రౌండ్ ట్రూత్‌నింగ్‌లో ప్రతి కమతంలో ఉన్న రైతుల వివరాలను పకడ్బందీగా సేకరించాలన్నారు. తద్వారా రికార్డులలో ఖచ్చితత్వంతో పాటు పారదర్శకంగా రూపొందించే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్, మండల సర్వేయరు జి.వెంకటేశ్వరరావు, రీ సర్వే డీటీ కె.సాయి, వీఆర్వో గుడివాడ సుబ్బారావు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హస్తకళలపై విద్యార్థులకు శిక్షణ



గుడివాడ గ్రంథాలయంలో పేపర్‌తో చేసిన వస్తువులను ప్రదర్శిస్తున్న చిన్నారులు



జమీగొల్వేపల్లిలో తయారు చేసిన కళాకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు హస్తకళలపై శిక్షణ ఇచ్చారు. క్రాఫ్ట్ టీచర్ ఎస్‌కే సుభాని, ఎస్.శిరీష ఆధ్వర్యంలో చిన్నారులకు పేపర్ ద్వారా అనేక రకాల వస్తువులు, డిజైన్లు తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. ఇది చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్‌కే సుభాని అన్నారు.

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తే ఎన్నో నూతన ఆవిష్కరణలకు కారణభూతమవుతాయని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులలోని మేధా శక్తిని ఉపయోగించి ఎన్నో కొత్త కొత్త రూపాలను తయారు చేయిస్తున్నామని అన్నారు. ఆలోచనా శక్తికి పదును పెట్టి దాని ద్వారా మరెన్నో నూతన కళలను ఆవిష్కరించవచ్చునని అన్నారు. అనంతరం విద్యార్థులు పేపరు సహాయంతో తయారు చేసిన క్రాఫ్ట్ కళాకృతులు, వివిధ పద్ధతుల ద్వారా తయారు చేసిన కళాకృతులను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, విద్యార్థులు పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రులో... గణితం అంటే భయం వదిలి ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో గణిత ఉపాధ్యాయురాలు ఎం.అనూరాధ విద్యార్థులకు గణితంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బిజినెస్ గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రమాబాయికి నివాళి

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విశ్వమాత రమాబాయి 88వ వర్ధంతి కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ విశ్వమాత రమాబాయి అంబేడ్కర్ సహకారంతోనే భారతదేశానికి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించగలిగారని వివరించారు. రమాబాయి చిత్రపటానికి బ్యాచిలర్ ఇన్ లైబ్రరీ సైన్స్ విద్యార్థిని మాతంగి సుష్మసరోజ, గ్రంథాలయాధికారి పర్వీన, బేతపూడి కుసుమ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

మండవల్లి: ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఏపీఓ ఎస్.నవీన్ అన్నారు. మండలంలోని పెరికెగూడెంలో రూ.1,27,277తో చేపట్టిన పంటబోదె పనుల్లో శనివారం 68 మంది కూలీలు పాల్గొన్నట్టు తెలిపారు. ఉపాధి పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, తాగు, సాగునీటి సమస్యలు తీరుతున్నాయని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..

పామర్రు: నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉపాధి హామీ పనులు నిర్వహించాలని పామర్రు ఏపీవో పోలు రాజు అన్నారు. పోలవరం, రాపర్ల, ఉండ్రపూడి, దగ్గుమిల్లి గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కచ్చితమైన కొలతలతో నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలని అన్నారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 5320 మంది ఉపాధి హామీ కూలీలతో పనులు నిర్వహించామని వివరించారు.

అగ్ని బాధితుడికి సాయం



కోడూరు: ఉల్లిపాలెం గ్రామానికి చెందిన చాత్రగడ్డ రంగారావు నివాస గృహం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల దగ్ధమైంది. 1977–78 విద్యా సంవత్సరంలో కోడూరు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రంగారావు కుటుంబ సభ్యులకు రూ.15 వేలు విలువ చేసే గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు, రూ.5 వేల నగదును అందించారు. పూర్వ విద్యార్థులు అన్నం వెంకటేశ్వరరావు, అన్నం యోగానందం, బడే భావన్నారాయణ, కొల్లి వెంకటేశ్వరరావు, పీవీ కృష్ణారావు, కోట తిరుమలరావు పాల్గొన్నారు.

స్వామి వారికి వెండి వస్తువుల సమర్పణ



మోపిదేవి: మోపిదేవిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి స్థానిక భక్తులు విస్సంశెట్టి శ్రీధర్ కుమారుడు మోహన వెంకట సాయికృష్ణ రూ. 70 వేలు విలువగల వెండి వస్తువులను బహూకరించారు. శనివారం ఉదయం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న ఆయన ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు వెండి పళ్లెం, శఠారి, ఏక హారతి అందించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. దాతలను సన్మానించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

గుడివాడటౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కరుణాపీఠం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, భోజనం పంపిణీ చేశారు. సేవా సంఘం సభ్యులు రేవంత్ సత్యశివరామ్ యాదవ్ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ వైవీ కృష్ణారావు, ఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు కె.రామకృష్ణ, శ్రీరామ్ యాదవ్, వంశీ, భవాని తదితరులు పాల్గొన్నారు.

రుణాల యాప్ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

దిశ పోలీసులకు బాధిత మహిళ ఫిర్యాదు

గుడివాడరూరల్: రుణాల యాప్ బాధితుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని గుడివాడ పట్టణంలోని దనియాలపేటకు చెందిన ఓ మహిళ శుక్రవారం రాత్రి దిశ పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని దనియాలపేటలో నివాసం ఉండే ఓ మహిళ మైలోన్ రుణాల యాప్ నుంచి ఈనెల 13వ తేదీన రూ.7,500 అవసరమైన రుణం తీసుకుంది. వారం రోజుల వ్యవధిలో ఈనెల 19వ తేదీన తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా మొత్తం చెల్లించింది. రెండు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు వివిధ నంబర్ల నుంచి ఆమెకు ఫోన్‌కాల్స్ చేసి అదనంగా డబ్బులు కట్టాలని వేధిస్తున్నారు. అసభ్య పదజాలంతో మాట్లాడుతూ మహిళను వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై సదరు మహిళ రుణాల ఆగంతకుల నుంచి రక్షణ కల్పించాలని గుడివాడ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఆగంతకుల ఆచూకీ కనిపెట్టే పనిలో ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ యాప్ మోజులో పడవద్దని, రుణాలు తీసుకుని ఇబ్బందులకు గురి కావద్దని పోలీసులు ప్రజలను హెచ్చరించారు.

ఎండవేడి.. వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి



నిర్మానుష్యంగా మారిన కోడూరు–నాగాయలంక ప్రధాన రహదారి



నక్కవానిదారి గ్రామంలో ప్రధాన రహదారి పక్కన చెట్ల కింద సేదతీరుతున్న రైతులు

కోడూరు: రోహిణి కార్తెలో భానుడు ప్రతాపం చూపుతున్నారు. రెండు రోజుల నుంచి సూర్యుడు సెగలు కక్కడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దివిసీమలోని ఆరు మండలాల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయి. శనివారం సగటున అన్ని మండలాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడికి వడగాడ్పుల తీవ్రత తోడవడంతో ప్రజలు బయటకు రావాలంటే హడలిపోతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు ప్రతాపాన్ని చూపడంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఎండ వేడికి ఇళ్లల్లో ఉండలేక ప్రజలు చెట్ల కింద సేద తీరుతూ కనిపించారు. పశువులు సైతం ఎండ వేడికి తాళలేక చెరువుల్లో సేదతీరాయి. అత్యవసరంగా ప్రయాణాలు చేసే వారు తలకు, ముఖానికి చేతి రుమాలు, కాటన్ మాస్క్‌లు ధరించి వెళ్తున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రకొనసాగుతుండగా, వేడిగాలులు మాత్రం రాత్రి 8 గంటల వరకు వీస్తున్నాయి. శీతల పానీయాలకు, కొబ్బరి బొండాలకు డిమాండ్ ఏర్పడింది.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- బొబ్బర్లంకలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

బొబ్బర్లంక(మోపిదేవి): అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరంతర అమలుకు జగనన్నను మరోసారి దీవించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కొక్కిలిగడ్డ గ్రామ సచివాలయ పరిధిలో బొబ్బర్లంక గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ కన్వీనర్ ముమ్మనేని అరవింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు 259 గృహాలను సందర్శించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. నియోజక వర్గంలోని 77 గ్రామ సచివాలయాలకు గాను మే 11, 2022 నుంచి 61 గ్రామ సచివాలయాలు పూర్తిచేయగా, మరో 16 గ్రామ సచివాలయాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఇంటా 4 నుంచి 5 లక్షలు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారని గుర్తుచేశారు. తుపాన్‌కు దెబ్బతిన్న రైతులకు పసుపు, అరటి రైతులను ఆదుకునేందుకు ఎన్నడూ లేని విధంగా గ్రామానికి రూ. కోటి అందించారని వివరించారు. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో రానున్న 10–15 సంవత్సరాల్లో ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చరిత్ర పుటల్లో నిలవనుందని చెప్పారు. పేదల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని కోరారు. ప్రధానంగా దళితవాడలో అంతర్గత రహదారులు వేయించాలని, పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, పాఠశాల నుంచి కృష్ణానది వరకు విద్యుత్ లైన్ వేయించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికే జగనన్న ప్రజాప్రతినిధులు, అధికారులను గ్రామాల్లోకి పంపారని చెప్పారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఆది రాంబాబు, తుటారం కృష్ణ, ముమ్మనేని వీరభద్రరావు, కోనేరు రామకృష్ణ, వేములపల్లి నాగేశ్వరరావు, ముమ్మనేని వీరయ్య చౌదరి, రాయన సత్యనారాయణ, కోసూరు శివనాగ మల్లేశ్వరరావు, మత్తి వెంకట రాజాచంద్, మీసాల చిట్టిబాబు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, వీఆర్వో నీలకాంత్, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. వీరికి సర్టిఫికెట్లను డీఎంహెచ్ఓ అందజేసి మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను జిల్లాలో 356 మందిని నియమించారని, వీరిని 40 మంది బ్యాచ్‌లుగా విడగొట్టి వారం రోజులు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల్లో వీరికి విధులు కేటాయించి ప్రాథమిక చికిత్స చేసేలా శిక్షణ ఇస్తున్నామని వివరించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల ద్వారా వీరికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ డీపీఎంఓ డాక్టర్ సి. సుదర్శన్‌బాబు, డాక్టర్ సాయికిరణ్, నోడల్ అధికారులు శ్రీనివాసరావు, ఖుద్దూస్ పాల్గొన్నారు.

ఘనంగా నిర్భయానంద విగ్రహ ఊరేగింపు



నిర్భయానంద గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న విద్యాసాగర్ గురూజీ, బంగారుబాబు

పాగోలు(చల్లపల్లి): గ్రామంలోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాంగణంలో నిర్భయానంద స్వామి ప్రథమ ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం స్వామి వారి నూతన విగ్రహ ఊరేగింపు ఘనంగా జరిగింది. పాగోలు, మేకావారిపాలెం, చల్లపల్లి మీదుగా నిర్భయానంద స్వామి విగ్రహం ఊరేగింపు సాగింది. ఆశ్రమ ప్రాంగణంలో ప్రాతూరి విద్యాసాగర్ గురూజీ–శారద దంపతులు, ఆశ్రమ నిర్వాహకులు మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు)–విజయ దంపతులచే వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, ధేను దర్శనం, మహా పూర్ణాహుతి, అన్న సమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నిర్భయానంద స్వామి శిష్య బృందం తరలివస్తున్నారు.

నాగలక్ష్మి దంపతులకు సన్మానం



నాగలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న రాజబాబు

బంటుమిల్లి: నాగన్నచెరువు గ్రామానికి చెందిన మానికొండ నాగలక్ష్మీ 700 భగవద్గీత శ్లోకాలు కంఠస్థం చేసి బంగారు పతకం అందుకోవడంతోపాటు పలువురు శిష్యులను తయారు చేయడం మహద్భాగ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జి. రాజబాబు అన్నారు. శనివారం మండల పార్టీ ఆధ్వర్యంలో నాగలక్ష్మి దంపతులను స్థానిక నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. బీజేపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి పి. రామాంజనేయులు, గుడివాడ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎ. సతీష్, కృత్తివెన్ను మండల అధ్యక్షుడు కె. ఏసురాజు, శివశక్తి జిల్లా ఇన్‌చార్జి గంగాధర్, మహిళా నాయకురాలు పి. రత్నకుమారి పాల్గొన్నారు.